# నేను మీ సేవకుడిని

ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బొట్టు పెడుతున్న యువతి

- మరోసారి ఆశీర్వదించండి
- మీ కోసమే పనిచేస్తా.. మీ వెంటే ఉంటా
- కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతం
- పనిచేసే ప్రభుత్వానికే మద్దతు పలుకండి
- హుజూరాబాద్ తరహాలో దళితులందరికీ ఒకేసారి దళితబంధు ఇస్తాం
- ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్
- పాతగూడూర్, శానబండలో ప్రజా ఆశీర్వాద యాత్ర



వెల్గటూర్, నవంబర్ 17: ''నేను మీ సేవకుడిని. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మీ వెంటే ఉంటా. మీ కోసమే పనిచేస్తా. నాయకుడిగా కాకుండా మీలో ఒకడిగా పని చేస్తా. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతా'' అని ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పనిచేసే ప్రభుత్వానికే మద్దతు పలుకాలని, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు విని గోస పడవద్దని సూచించారు. ఈ రాష్ట్రాన్ని 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేయలేదని, ఇప్పుడు మరోసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు గ్రామాలమీద పడి తిరుగుతున్నారన్నారు. ఏండ్లకొద్దీ పాలించి పనులు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా.. ఒకసారి ఆలోచించాలని, మీ ఇంటికి వచ్చే నాయకులను నిలదీయాలని సూచించారు. మళ్లీ వారు అధికారంలోకి వస్తే పైరవీలు, గుండాగిరి, దాదాగిరీలు రాజ్యమేలుతాయని మండిపడ్డారు. శుక్రవారం ఎండపల్లి మండలం పాతగూడూర్, శానబండ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించగా, ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మ, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఆయా చోట్ల మంత్రి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కొనియాడారు. మాయమాటలు, ఆరు గ్యారంటీలంటూ ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చే కాంగ్రెస్ నాయకుల మాటలు వింటే మోసపోయి గోసపడుతామని, రాష్ట్రం మరో 50 ఏండ్లు వెనక్కిపోతుందన్నారు. ఆ పార్టీలోని నేతలు ముఖ్యమంత్రి సీటు కోసం కొట్లాడుకోవడం తప్ప ప్రజలను పట్టించుకోరని ఎద్దేవా చేశారు. వ్యవసాయం, విద్యుత్‌పైనా అవగాహన లేని రేవంత్ రెడ్డి 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలని మాట్లాడడం చూస్తుంటే ఆయన మతిపోయినట్లుగా అనిపిస్తున్నదన్నారు. అభివృద్ధి అంటే కేరాఫ్ తెలంగాణ అనే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ఎన్నోఏండ్లుగా దళితులను ఓటు బ్యాంక్‌గా చూశాయే తప్ప, ఏనాడూ వారి అభ్యున్నతికి చొరవ చూపలేదని, గుర్తింపు ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్ దళితుల అభ్యున్నతికి దళిత బంధు పథకాన్ని తెచ్చి రూ.10 లక్షలు అందజేస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికలు పూర్తి కాగానే హుజూరాబాద్ తరహాలో ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందజేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని, కచ్చితంగా ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కునమల్ల లక్ష్మి, వైస్ ఎంపీపీ ముస్కు కవిత, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సర్పంచ్‌లు మారం జలేందర్‌రెడ్డి, బిటుకు పద్మ, బోడకుంటి రమేశ్, గంగుల నాగేశ్, కొప్పుల విద్యాసాగర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సింహచలం జగన్, నాయకులు పోనుగోటి రామ్మోహన్‌రావు, గంగుల అశోక్, చుక్క శంకర్ రావు, గాజుల మల్లేశం, గూడ రాంరెడ్డి, గంధ్ర విష్ణువర్ధన్‌రావు, గంధ్ర నర్సింగరావు, కొంగల చంద్రారెడ్డి, వుస్కమల్ల పరందాములు, తంగళ్లపల్లి చకప్రాణి, కంది విష్ణు, గాగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, హనుమంత్‌రావు, యుగందర్‌రావు, వేణుగోపాల్‌రావు, పడిదం మొగిళి, జుపాక కుమార్, తిరుపతి, నారాయణ, రియాజ్, మల్లేశ్, జీరెడ్డి మహేందర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు గాదం భాస్కర్, వెంకటేశ్, సతీశ్, సత్యం, నర్సయ్య తదితరులు ఉన్నారు.

# ఎట్టికైనా.. మట్టికైనా మనోడుంటెనే మంచిది

- ప్రతిపక్ష అభ్యర్థులు పరాయివాళ్లు.. నేను మీ బిడ్డను
- పార్టీల సిద్ధాంతాలు ప్రధానం
- కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి
- కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- మెట్‌పల్లి మండలం వేంపేటలో ఎన్నికల ప్రచారం



మెట్‌పల్లి రూరల్: వేంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 17: 'ఎట్టికైనా.. మట్టికైనా మనోడుంటేనే మంచిదంటరు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులెవరూ స్థానికులు కాదు. నేను మెట్‌పల్లికి చెందిన మీ బిడ్డను. అండగా ఉంటా. ఆశీర్వదించండి' అని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రజలకు పిలుపునిచ్చారు. 'స్థానికుడు కావాలా.. పరాయివారు కావాలా' ఆలోచన చేయాలని సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించగా, యువకులు, మహిళలు, రైతులు, వృద్ధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో సంజయ్ ప్రసంగించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుణగణాలతో పాటు వారి వెనకాలున్న పార్టీ సిద్ధాంతాలను కూడా ఓటర్లు గమనించాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు అసత్య ప్రచారాలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నాయని, వారికి ప్రజా సంక్షేమంపై పట్టింపు లేదన్నారు. కానీ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు రైతును రాజుగా చేయాలన్నదే సిద్ధాంతమని తెలిపారు. అందుకే రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్, సమయానికి ఎరువుల పంపిణీ, గ్రామాల్లోనే ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 65 ఏళ్ల ప్రతిపక్షాల పాలనలో ప్రజలు నానా గోస పడ్డారని, కేసీఆర్ వచ్చినంక కేవలం తొమ్మిదేళ్లలో ఎనలేని అభివృద్ధి, ప్రజా సంక్షేమం జరిగిందని చెప్పారు. దేశంలో బీడీ కార్మికులకు పింఛను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే పీఎఫ్ కటాఫ్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పింఛన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రైతుబీమా తరహాలో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల బీమా సౌకర్యం, రేషన్ దుకాణం ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఆసరా పింఛన్లను విడతల వారీగా రూ. 5,016, వికలాంగ పింఛను రూ. 6,016కు పెంచనున్నట్లు చెప్పారు. బీజేపీకి చెందిన అభ్యర్థి నిజామాబాద్ నుంచి, కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థి హైదరాబాద్ నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేయగా, తాను మాత్రం మెట్‌పల్లికి చెందిన బిడ్డగా ఇక్కడి నుంచే పోటీచేస్తున్నట్లు చెప్పారు. కారు గుర్తుకు ఓటేసి మీ బిడ్డగా తనను ఆశీర్వదించాలని కోరారు. ఇక్కడ ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజరెడ్డి, ఎంపీటీసీ పుల్ల చంద్రశేఖర్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు ఉన్నారు.



గౌడసంఘం నాయకులతో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

# ప్రతిపక్షాలది అధికార దాహం

- నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే
- కాంగ్రెస్‌వన్నీ ఫేక్ హామీలే..
- 60 ఏండ్లు అధికారంలో ఉండి చేయనోళ్లు ఇప్పుడు చేస్తరా..?
- ఆరు గ్యారెంటీలు వట్టివే
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి
- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- రాయికల్‌లో కుల సంఘాలతో సమావేశం

రాయికల్, నవంబర్ 17: ''ఎన్నికలు వచ్చినయి. ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్, బీజేపీలు గాయిగాయి చేస్తున్నయి. అధికార దాహంతో అడ్డగోలుగా మాట్లాడుతూ అసత్యప్రచారం చేస్తున్నయి. కాంగ్రెస్ ఇచ్చేవన్నీ ఫేక్ హామీలే. 60 ఏండ్లు అధికారంలో ఉండి చేయనోళ్లు ఇప్పుడు చేస్తరా..?. ఆలోచించాలని'' జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. రాయికల్ మండల కేంద్రంలో వివిధ కుల సంఘాలను కలివారు. కారు గుర్తుకు ఓటు వేసి జగిత్యాల ఎమ్మెల్యేగా రెండో సారి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని కులాలు, వర్గాలు అభివృద్ధిలోకి తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. అన్ని వర్గాలకు ఉచితంగా విద్య, వైద్యం అందించడమే కాకుండా వ్యవసాయ రంగానికి నిరంతరం 24గంటలు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో సర్కారు బడులు, ప్రభుత్వ దవాఖానలు, కరంటు సరఫరా ఎట్లుండే.. ఇప్పుడెట్ల అభివృద్ధి చెందినయి.. కరెంట్ ఎట్లా వస్తున్నదో ఆలోచించాలని సూచించారు. పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో సర్కారు బడులను బలోపేతం చేసి ఇంగ్లిష్ మీడియంలో బోధన అందిస్తున్నామని, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ప్రైవేట్ వైద్యం పేదలకు భారంకావద్దని దవాఖానలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామని చెప్పారు. ఒకప్పుడు తొంబర్రావుపేట పక్క నుంచి కెనాల్ పోతున్నా చెరువుల్లో నీరు ఉండేదికాదన్నారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్‌తో మాట్లాడి కాలువను బాగు చేయించడంతో తొంబర్రావుపేట చెరువు ఫుల్లుగా నిండి అక్కడి నుంచి నీళ్లు పరవళ్లు తొక్కడంతో పోరుమల్ల, మైతాపూర్, ఇటిక్యాల, కొత్తపేట, బోర్నపెల్లి దాకా చెరువులు సైతం నిండుగా ఉంటున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో పింఛన్ ఎంతుండె..? ఇప్పుడెంతిస్తున్నమో..? ఆలోచించాలని, రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలకు పెంచామని చెప్పారు. ఎన్నికలు వచ్చాయని కాంగ్రెస్ నాయకులు పింఛన్ రూ.4వేలు ఇస్తామని అంటున్నారని, మరి గతంలో ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆడబిడ్డల పెండ్లిల్లకు గతంలో 10 రూపాయలు ఇవ్వనోళ్లు ఇప్పుడు తులం బంగారం ఇస్తమంటే నమ్ముదామా..? అని సూచించారు. తెలంగాణ వచ్చాక అన్ని రకాల పింఛన్ల మొత్తాన్ని పెంచామని, ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి సాయం చేస్తున్నామని చెప్పారు. 'నేనొక్కటే చెబుతున్నా.. కాంగ్రెస్ అది ఇస్తాం.. ఇది చేస్తాం అంటున్నది. ఆ మాటలకు గ్యారెంటీ లేదు. కానీ తాము ఇప్పటికే ఇస్తున్నాం. రాబోయే రోజుల్లో ఆసరా పింఛన్‌ను రూ.5వేలు, వికలాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచుతున్నాం. ప్రతి మహిళకు రూ.3వేల జీవనభృతి ఇస్తాం. ప్రతి వ్యక్తికి రూ.5లక్షల ఉచిత బీమా అందిస్తం' అని వివరించారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని, తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని సంజయ్‌కుమార్ కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఏఎంసీ చైర్మన్ మారంపెల్లి రాణి, కౌన్సిలర్లు, వివిధ కుల సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# గోదావరికి హారతి

గోదావరి నదికి హారతినిస్తున్న భక్తులు, దేవస్థాన సిబ్బంది



ధర్మపురి, నవంబర్17: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ధర్మపురిలో గోదావరి హారతి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు శుక్రవారం లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం నుంచి సాయంత్రం దేవస్థాన సిబ్బంది మేళ తాళాలతో గోదావరి నది తీరానికి వచ్చారు. ఒడ్డున నదీమ తల్లికి పండితులు ప్రత్యేక పూజలు చేయగా, భక్తులు గోదావరిలో కార్తీక దీపాలను వదిలారు. ఇక్కడ దేవస్థానం ఈఓ సంకటాల శ్రీనివాస్, రెనోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామన్న, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచా రి, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.